మంచిమాట



మనిషి ఎప్పుడు ఖాళీగా ఉండకూడదు.. ఉంటే పనికిరాని ఆలోచనలు వచ్చి అజ్ఞానిగా మారిపోతారు.

స్వామి వివేకానంద



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 303 | గురువారం 21 మే 2026 | పేజీలు : 8 వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## ఇటలీలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



పలు రోజుల నుంచి విదేశీ పర్యటనలతో పీఎం మోడీ చక్కర్లు కొడుతున్నారు. తాజాగా ఇటలీలోని రోమ్‌లో ప్రధానమంత్రి అడుగుపెట్టగా , ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఆయనకు స్వాగతం పలికారు. భారత్-ఇటలీ సంబంధాల

- మిగతా 2లో..

## 'మోడీ దేశద్రోహి'..

- రాయ్‌బరేలీ సభలో ప్రసంగించిన రాహుల్
- మోదీ, అమిత్ షా దేశద్రోహులని వ్యాఖ్య
- రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శ
- పెట్రో ధరలు పెరుగుతాయని అంచనా
- రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

2లో





### బండి భగీరథ్ పోక్సో కేసు..

## మరో సెక్షన్‌ను జత చేసిన పోలీసులు

- కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన భగీరథ్
- ఫోన్‌లోని డేటాను డిలీట్ చేసిన వైనం
- సాక్ష్యాలను ధ్వంసం చేసిన సెక్షన్ జత చేసిన పోలీసులు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ కీలక సాక్ష్యాలను మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన నిందితుడు, పరారీలో ఉన్న సమయంలో పథకం ప్రకారం తన అత్యాధునిక ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను

- మిగతా 2లో..



### రూ.1000 లంచానికి

## లక్ష బహుమతి..

- సీఎం విజయ్ సంచలన నిర్ణయం....
- తమిళనాడు ప్రభుత్వం సరికొత్త ప్రోత్సాహక పథకాన్ని అధికారికంగా ప్రకటించింది

చెన్నై - సూర్య వాస్తవం

ఈ నూతన విధానం ప్రకారం ఏ ప్రభుత్వ శాఖలోనైనా సరే, మీ నుండి కేవలం రూ.1000 లంచం డిమాండ్ చేసినా.. ప్రజలు సాక్ష్యాధారాలతో స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చు. లంచాలు అడిగే అధికారులపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసిన పౌరులకు ప్రభుత్వం తరపున రూ.1,00,000 నగదు బహుమతి ఇస్తామని సంచలన ప్రకటన చేసింది. ఇందుకోసం 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1800 425 1555 అనే ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ప్రవేశపెట్టింది.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలను భాగస్వాములను చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు

# ఏపీలో పనిచేయాలి

- ఫౌండేషన్ 45వవార్షికోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- హింసలేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని బోధిస్తున్నారన్న సీఎం
- గ్రామాల నుంచి కొలంబియా వరకు అనిశ్చితి నెలకొంటే చర్చల ద్వారా మార్పులు తెచ్చినట్లు వెల్లడి

అమరావతి - సూర్య వాస్తవం



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేయాలని ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. కేవలం ఓ ముఖ్య మంత్రిగానే ఇక్కడికి రాలేదని, ఓ భారతీయుడిగా, గురూజీ బోధనల్ని అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని, శాంతి సామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని కొనియాడారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తున్నారని అన్నారు. హింసలేని సమాజం-ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ

- మిగతా 2లో..



## కులగణన నిర్వహించడంలో తప్పేమీలేదు

- వెనుకబడిన వారెవరో ఏ ప్రభుత్వమైనా తెలుసుకోవాల్సిందే : సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశంలో కులగణన ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. జనగణనలో భాగంగా కులాల లెక్కింపును చేపట్టడానికి న్యాయస్థానం లైన్ క్లియర్ చేసింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, వాటిని పూర్తిగా కొట్టివేస్తూ ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కులగణన అనేది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇటువంటి పరిపాలనాపరమైన వ్యవహారాలలో న్యాయస్థానాల జోక్యం ఎంతమాత్రం ఉండబోదని స్పష్టం చేసింది. సమాజంలో వెనుకబడిన జనాభా

- మిగతా 2లో..

- పెట్టుబడుల ఆకర్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు
- ఎస్కార్ట్ ఆఫీసర్‌గా గ్రూప్-1 అధికారి
- తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాల అధ్యయనం
- బుల్లెట్ ట్రైన్ కోసం భూసేకరణ
- డేటా సిటీ కోసం 1,500 ఎకరాలు
- ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు
- భారత్ ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

## ఇన్వెస్ట్ తెలంగాణ



హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. దీని కోసం ప్రత్యేక వెబ్‌సైట్, లోగోను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ ప్రత్యేక కార్యాలయాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసి, దానికి గ్రూప్-1 అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేసి,

- మిగతా 2లో..



### పోలీస్ శాఖలో

## బాధ్యత పెరగాలి

- వ్యవస్థలో అందరూ భాగస్వాములే..
- పరిధి దాటితే ఒప్పుకునేది లేదు : పోలీస్ అధికారుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

పోలీస్ శాఖలో రెస్పాన్సిబిలిటీ పెరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వ్యవస్థలో అందరూ భాగస్వాములేనని, అందువల్ల పరిధి దాటేందుకు ప్రయత్నిస్తే పోలీస్ అధికారులనైనా ఒప్పుకోబోమని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎమ్‌సీఆర్ హెచ్‌ఆర్‌డీ)లో బుధవారం పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలను పోలీస్ అధికారులతో పంచుకునేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా హెడ్ క్వాటర్స్ వదలాలంటే తప్పని సరి గా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. క్రైమ్ రివ్యూ మీటింగులను నిర్ణీత వ్యవధిలో తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ లు నిరంతరం జిల్లాల్లో పర్యటించాలని, ఐజీ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల పైన నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కొత్త పంథాలో నేరాలు (క్రైమ్ అప్‌డేట్) అవుతోందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా పోలీసింగ్ కూడా అప్‌డేట్ కావాలన్నారు. గంజాయి రవాణాను అరికట్టాలని, దానిపై

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


### దేశవ్యాప్తంగా

## మెడికల్ షాపుల బంద్..

- 24 గంటల పాటు సమ్మె
- ఆన్‌లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్
- ఏఐఓసీడీ పిలుపుతో సమ్మెలో పాల్గొంటున్న 12.40 లక్షల మంది ఫార్మసిస్ట్‌లు
- ఆన్‌లైన్ మందుల అమ్మకాలు పూర్తిగా చట్టవిరుద్ధమని ఆరోపణ
- భారీ డిస్కౌంట్లను అరికట్టాలనేది ప్రభుత్వానికి ప్రధాన డిమాండ్
- సమ్మె సమయంలో అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయని హామీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



ఆన్‌లైన్‌లో నియంత్రణ లేకుండా జరుగుతున్న మందుల విక్రయాలు, భారీ డిస్కౌంట్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు, ఫార్మసీలు నేడు బంద్ పాటిస్తున్నాయి. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు ఈ 24 గంటల సమ్మెను

- మిగతా 2లో..

# ఇటలీలో ప్రధాని మోడీ

(మొదటిపేజీ తరువాయి)
బలోపేతమే లక్ష్యంగా ఇరువురి నేతల మధ్య చర్చలు జరగనున్నాయి. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ తనకు 'మెలోడీ' టాఫీల (చాక్లెట్ల) ప్యాకెట్‌ను బహుమతిగా ఇస్తున్న వీడియోను మెలోని స్వయంగా షేర్ చేశారు. ఆ వీడియోకు "బహుమతికి ధన్యవాదాలు" అని ఆమె క్యాప్షన్ పెట్టారు. అదే విధంగా ప్రధానమంత్రి మోడీ బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాతో ప్రతినిధి బృంద స్థాయి చర్చలు జరిపారు. ఈ ద్వైపాక్షిక సమావేశంలో పీఎం మోడీ వెంట విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి (పశ్చిమ) సిబి జార్జ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి, ఇతర సీనియర్ దౌత్య అధికారులు పాల్గొన్నారు.

# 'మోడీ దేశద్రోహి'..

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మోదీ 'దేశద్రోహి' అని విమర్శించారు. దేశాన్ని అమ్మేశారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో ఓ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన మీకు ధన్యవాదాలు. ఇంటికి వెళ్లాక మీ దగ్గరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వచ్చి మోదీ, అమిత్ షా గురించి మాట్లాడితే దీటుగా సమాధానం ఇవ్వండి. మీ ప్రధాని, హోంమంత్రి, మీ సంస్థ దేశద్రోహులని వారికి చెప్పండి. వాళ్లు దేశాన్ని అమ్మేయడానికి పనిచేస్తున్నారని తెలియజేయండి. మన వ్యవస్థలపై దాడి చేస్తున్నారని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, అంబేద్కర్, వీర్ పాసి, మహాత్మా గాంధీని విమర్శిస్తున్నారని చెప్పండి" అంటూ రాహుల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరుగుతాయని రాహుల్ అంచనా వేశారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వ వైఫల్యం వల్ల త్వరలో ఆర్థిక తుపాను రాబోతోందని పునరుద్ఘాటించారు. దీనికి మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్సే కారణమన్నారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని ఆక్షేపించింది. దేశ ప్రజలను రాహుల్ అవమానిస్తున్నారంటూ మండిపడింది.

### బండి భగీరథ్ పోక్సో కేసు..

# మరో సెక్షన్‌ను జత చేసిన పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)
డిలీట్ చేయడమే కాకుండా, సోషల్ మీడియా అకౌంట్లను కూడా మాయం చేశాడు. అరెస్ట్ అనంతరం పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో సిమ్ కార్డ్ లేకపోవడం, ఫోన్ ఖాళీగా ఉండటంతో.. సాక్ష్యాలను ధ్వంసం చేసిన నేరం కింద పోలీసులు ఈ కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్ 238ను (గతంలో ఐపీసీ 201) జోడించారు. చట్టం నుంచి తప్పించుకోవడానికి ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు, నిందితుడి కంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో ఉచ్చు బిగించేందుకు సిద్ధమయ్యారు. ఐఫోన్ సెక్యూరిటీ ఫీచర్లు కఠినంగా ఉన్నప్పటికీ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఫీూా) నిపుణుల వద్ద ఉన్న 'సెలెబ్రైట్' వంటి అంతర్జాతీయ స్థాయి అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ల ద్వారా డిలీట్ అయిన చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ ఐఫోన్ అంతర్గత మెమొరీని పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా, ఐక్లౌడ్ బ్యాకప్ సర్వర్ల నుండి డేటాను సేకరించేందుకు, అవసరమైతే కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకు సైతం సిద్ధమవుతున్నారు. వీటితో పాటు, నిందితుడు ఫోన్ స్విచ్చాఫ్ కావడానికి ముందు ఎక్కడ ఉన్నాడు, ఎవరితో మాట్లాడాడు, ఆశ్రయం కల్పించిన తెరవెనుక సూత్రధారులు ఎవరు అనే వివరాల కోసం సెల్ టవర్ మ్యాపింగ్, కాల్ డేటా రికార్డులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సాంకేతిక ప్రక్రియల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, కేసును పటిష్టంగా కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు 'ప్లాన్ బి'ని కూడా సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా బాధితురాలి ఫోన్‌ను మరో కీలక సాక్ష్యంగా మార్చనున్నారు. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపు సందేశాలు, ఫొటోలు, వీడియోలను 'రిసీవ్డ్ డేటా' రూపంలో సేకరించి, వాటిని ధ్రువీ కరించి కోర్టు ముందు ఉంచనున్నారు. పోక్సో కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం నేర తీవ్రతను మరింత పెంచుతుందని చట్టపరమైన నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

### కులగణన నిర్వహించడంలో

# తప్పేమీలేదు

(మొదటిపేజీ తరువాయి)
వివరాలు, వారి సామాజిక స్థితిగతులు కచ్చితంగా తెలిసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా, వాటి సమర్థవంతమైన అమలుకైనా కులగణన అనేది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇది నేటి పరిస్థితుల్లో తప్పనిసరి అని న్యాయమూర్తి పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు ఎంతమంది వెనుకబడిన కులాల వారున్నారో తెలుసుకోవాలని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ కీలక తీర్పుతో దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలకు ఉన్న చట్టపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయినట్లయింది.

# అరటి పిలకలను దౌర్జన్యంగా పీకేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి

### - పులివెందుల అర్బన్ సీఐకి శ్రీరామ్‌కి బాధితుడి ఫిర్యాదు

**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల మండలం ఇ.కొత్తపల్లి గ్రామంలో పొలంలో సాగు చేసిన అరటి పిలకలను కొంతమంది వ్యక్తులు అక్రమంగా,దౌర్జన్యంగా పీకేసి నష్టం కలిగించడమే కాకుండా, ప్రశ్నించినందుకు దాడులకు యత్నించినట్లు బాధితుడు పులివెందుల అర్బన్ సీఐ కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఇ.కొత్తపల్లి గ్రామానికి చెందిన గజ్జల జయరామిరెడ్డి (తండ్రి: పెద్ద ఓబుల్ రెడ్డి) గ్రామానికి సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 749 లోని తన సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సదరు భూమిలో ఆయన అరటి తోట సాగు చేసేందుకు పిలకలను నాటారు.అయితే గత కొంతకాలంగా వీరి భూమికి పక్కనే ఉన్న వారితో రహదారి (రస్తా) విషయమై చిన్నపాటి సమస్య నడుస్తోంది.ఈ క్రమంలో బుధవారం తాము పొలంలో లేని సమయం చూసి అదే గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు బాల ఓబుల్ రెడ్డి,మల్లికార్జున రెడ్డి, ప్రసాద్ రెడ్డి,ఓబుల్ రెడ్డి బాధితుడి పొలంలోకి అక్రమంగా చొరబడీ నాటిన అరటి పిలక లను దౌర్జన్యంగా పీకేస్తూ నష్టం కలిగించారు. ఈ విషయాన్ని గమనించిన జయరామిరెడ్డి, ఆయన భార్య వెంటనే అక్కడికి చేరుకుని, మా పొలంలో అరటి పిలకలను ఎందుకు పీకేస్తున్నారు అని నిలదీశారు. దానికి సదరు వ్యక్తులు తీవ్ర ఆగ్రహానికి లోనై, మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ బూతులు తిడుతూ, భార్యాభర్తలిద్దరిపై భౌతికంగా దాడి చేయడానికి ప్రయత్నించారు.

### ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు

# ఏపీలో పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)
మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని కితాబిచ్చారు.

యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయటపడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని కొనియాడారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్ ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ, అనిశ్చితి నెలకొన్న కొలంబియా ప్రాంతాల వరకూ చర్చలు అనే శాంతి మార్గం ద్వారా మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మికవేత్త శ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు. 45 ఏళ్లక్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ బెటర్ వరల్డ్ అనే విజన్ తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజునవేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య లాంటి రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ను ఆయన అభినందించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రోజువారీ జీవితంలో చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయని వెల్లడించారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయని, సామాన్య ప్రజల జీవితాలు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోందని అన్నారు. గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కొని సమర్థంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాని మోదీ లాంటి సమర్థవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని జోస్యం చెప్పారు. వేల ఏళ్ల క్రితం వరకూ మానవాళిని నడిపించిన నేల ఇది. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన దేశం మనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనంలో శాంతిని సాధించేలా శ్రీ రవిశంకర్ గురూజీ తన బోధనలతో ప్రభావితం చేశారని, సంస్కృతితో మిళితమైన ఆధునికత, విలువలతో కూడిన జీవనం లాంటి ఎన్నో అంశాల ద్వారా తన బోధనల్ని సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మేం కూడా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి అధ్యాత్మిక క్షేత్రాలు నిండిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేననేది తన భావన అన్నారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యం కూడా అన్నారు.

ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకున్నామని చంద్రబాబు నాయుడు అన్నారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడిలేని సమాజాన్ని కూడా తీసుకురావాలని పేర్కొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని పేర్కొన్నారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని కోరారు.

**గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులు పొందిన ఎంపీ సానా సతీష్ బాబు**

బెంగళూరులో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పొందారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం గురుదేవ్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, గురుదేవ్ ఆశీస్సులు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత మనిషిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజసేవలో మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.

# ఇన్వెస్ట్ తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)
తెలంగాణ పాలసీని అంతకంటే మెరుగ్గా, ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం నాడిక్కడి మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష? సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) వైస్ చైర్మెన్ శశాంక్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జూన్ లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్ లో పరిశ్రమల ఏర్పాటు కు శంకుస్థాపన జరిగేలా చూడాలని చెప్పారు.

భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని సూచించారు. నెట్ జీరో సిటీ తరహా లోనే డిజైన్లు ఉండాలనీ, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన ఉండాలని చెప్పారు. దీనిలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారుల్ని హెచ్చరించారు. దీనికోసం అవసరమైతే అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీలోకి అంతర్జాతీయ స్థాయి సంస్థలను తీసుకురావాలనీ, దీనికోసం పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. అయితే ఫ్యూచర్‌సిటీలో తొలుత ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలనీ, ఆ తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలనీ, వాటి నీటి అవసరాలకోసం సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీ)లు వినియోగించు కోవాలని చెప్పారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను ఫ్యూచర్ సిటీ కి వచ్చేలా చర్య లు తీసుకోవాలనీ, దీనికోసం అవసరమైతే ప్రధాని మోడీని కలిసి హెల్త్ క్లస్టర్ కోసం ప్రత్యేక విజ్ఞప్తి చేద్దామని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యూచర్ సిటీలోనే ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని ఆదేశించారు. అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలోని ప్రభుత్వ భూముల్ని గుర్తించాలని ఆదేశించారు. ఈ కేంద్రాలు సాధ్యమైనం తగా ద్వితీయ శ్రేణి నగరాలల్లో ఏర్పాటయ్యేలా విధాన రూపకల్పన చేయాలని చెప్పారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూడు నెలల్లో టీ ఫైబర్ కు కనెక్ట్ కావాల్సిందేననీ, దీనిలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టంచేశారు. హైదరాబాద్ పురోగతిని మార్చే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. అంతకుముందు పరిశ్రమల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతి, ఫ్యూచర్ సిటీ ప్రాధాన్యతలను వివరించారు.

### పోలీస్ శాఖలో

# బాధ్యత పెరగాలి

(మొదటిపేజీ తరువాయి)
ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పోలీస్ డిపార్ట్మెంట్ లోని అన్ని వాహనాలు ఈవీకి మారాలని అన్నారు. శాంతి భద్రతల విషయం లో నిర్లక్ష్యంగా ఉంటే సహించబోనని హెచ్చరించారు. కాలం చెల్లిన ఆయుధాలను తొలగించాలని ఆదేశించారు. పెట్రోలింగ్ ను, విలేజ్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. రౌడీ షీట్,హిస్టరీ షీట్ ల పైన రివ్యూలు నిర్వహించాలని సూచించారు. ఎఫ్ ఎస్ ఎల్ విభాగాన్ని బలోపేతం చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. వచ్చే పదేండ్ల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీస్ డిపార్టుమెంట్ సిద్ధం కావాలని, ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

డ్రోన్ పోలీసింగ్ పెంచాలి..పోలీసింగ్ లో సాంకేతికతను వినియోగిం చుకోవాలి..సీసీ కెమెరాల సంఖ్యను పెంచుకోవాలి..కమాండ్ కంట్రోల్ సెంటర్ ని సమర్థ వంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. పోలీస్ డిపార్టుమెంట్ లో అవినీతికి ఆస్కారం ఉండకూడదని, మెరిట్ ప్రకారం పోస్టింగులు ఇవ్వాలని ఆదేశించారు. పోలీస్ అధికారుల మధ్య సమన్వయం పెరగాలని అన్నారు. డిపార్టుమెంటు బలోపేతం కోసం అన్ని విధాలుగా సహకరిస్తామని, ఐపీఎస్ ఆఫీసర్ల సంఖ్యను పెంచుకోవడానికి కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పిర్యాదుల కోసం క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలి..రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ ను ఒక యూనిట్ చేయాలి.. ఆహార కల్తీ పైన ఉక్కుపాదం మోపాలి..దాని కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆదేశించారు. ఆహార కల్తీ వల్ల క్యాన్సర్ కేసులు పెరగటం పట్ల సీఎం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు,రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి,డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి ,అదనపు డీజీ లు,పోలీస్ కమిషనర్ లు,ఐజీ లు పాల్గొన్నారు.

### దేశవ్యాప్తంగా

# మెడికల్ షాపుల బంద్..

(మొదటిపేజీ తరువాయి)
చేపట్టారు. ఈ సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా ఉన్న 12.40 లక్షలకు పైగా ఫార్మసిస్ట్‌లు, మందుల పంపిణీదారులు తమ కార్యకలాపాలను నిలిపివేశారు.

**చట్టవిరుద్ధంగా ఆన్‌లైన్ అమ్మకాలు**

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఆన్‌లైన్ మందుల విక్రయాలు పూర్తిగా చట్టవిరుద్ధమని, అక్రమమని ఏఐఓసీడీ జాతీయ అధ్యక్షుడు జేఎస్ షిండే ఆరోపించారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఎస్ఆర్ 817 నోటిఫికేషన్‌ను ఉటంకిస్తూ, ప్రస్తుత ఆన్‌లైన్ అమ్మకాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. "ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలపై ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో మేము మా వ్యతిరేకతను తెలిపాము. సరైన నియంత్రణ లేకపోతే ఈ వ్యవస్థ మాఫియా చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించాము. ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే ముందుగా పటిష్టమైన ఐటీ మౌలిక సదుపాయాలు అవసరమని ప్రభుత్వానికి సూచించాము" అని షిండే వివరించారు.

**ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు**

ఈ సమ్మె సందర్భంగా ఏఐఓసీడీ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచింది. అవి: 1. ఆన్‌లైన్ ఫార్మసీలకు సంబంధించి జారీ చేసిన జీఎస్ఆర్ 817 నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, మందుల విక్రయాలకు కొత్త మార్గదర్శకాలు రూపొందించాలి. 2. కరోనా మహమ్మారి సమయంలో తీసుకొచ్చిన జీఎస్ఆర్ 220 నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి. 3. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఇస్తున్న భారీ డిస్కౌంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ఈ డిమాండ్లపై షిండే మరింత స్పష్టతనిచ్చారు. "ఒకవేళ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు భారీ డిస్కౌంట్లు ఇవ్వడం కొనసాగిస్తే, మాలాంటి ఆఫ్‌లైన్ కెమిస్ట్‌లకు కూడా పోటీపడే అవకాశం కల్పించాలి. ఇందుకోసం డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డీపీసీఓ)ను సవరించి, మాకు అధిక మార్జిన్లు ఇవ్వాలి. అప్పుడే మేము కూడా వినియోగదారులకు ఎక్కువ డిస్కౌంట్లు ఇవ్వగలం" అని ఆయన అన్నారు.

**అత్యవసర సేవలకు అంతరాయం లేదు**

దేశవ్యాప్త బంద్ జరుగుతున్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర మందుల సేవలను కొనసాగిస్తామని ఏఐఓసీడీ హామీ ఇచ్చింది. "ప్రజలకు అత్యవసర మందులు అవసరమైతే అందించడానికి మేము అన్ని ఏర్పాట్లు చేశాము. అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదు" అని షిండే భరోసా ఇచ్చారు. ఈ నిరసనతో దేశంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఫార్మసీల మధ్య నియంత్రణ, వ్యాపార కార్యకలాపాలపై జరుగుతున్న చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది.

# తిరుపతి గంగమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు

- అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ
- కుప్పం చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన నేతలు, అధికారులు



**కుప్పం– సూర్య వాస్తవం :** కుప్పం పట్టణం లో నెలకొన్న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు బుధవారం ఉదయం కుప్పంకు చేరుకున్నారు. గంగమ్మ దేవాలయానికి చేరుకున్న సీఎం దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఎం సంప్రదాయ పద్దతుల్లో ప్రసన్న తిరుపతి గంగమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం సిఎం దంపతులు తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని గంగమ్మ తల్లి సమర్పించారు. తిరుపతి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరిలకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను చూసేందుకు జాతరకు వచ్చిన జనం పోటెత్తారు. వారికి సిఎం అభివాదం చేస్తూ పలకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ప్రజలకోసం గంగమ్మ తల్లి దర్శన ఏర్పాట్లను సుజావుగా నిర్వహించడం పై ఆలయ యాజమాన్య కమిటీని, నేతలను, అధికారులను అభినందించారు. ఆలయ ఛైర్మన్ రవిచంద్ర బాబు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కు దేవాలయ విస్తరణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలను తెలియజేశారు. ఇదిలా వుండగా సిఎం ఉదయం పదిగంటలకు అమరావతి నుంచి తుమ్మిశి హెలిప్యాడ్ కు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి కడపల్లి లోని తన స్వగృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఎంకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడీ, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్, జిల్లా అధికారులు, ఏపీ ఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ బి ఆర్ సురేష్ బాబు, టీటీడీ సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ కౌన్సిలర్ లు జాకీర్, వివిధ విభాగాల నామినేటెడ్ చైర్మన్ లు,డైరెక్టర్ లు,జనసేన బిజెపి నేతలు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.



## తాటి ముంజలు రుచి చూసిన సీఎం దంపతులు





**కుప్పం – సూర్య వాస్తవం:** కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి దంపతులు తంజమ్మకొట్టాలు వద్ద ఆగారు. కల్లుగీత కార్మికులు తాటిముంజలు తీస్తుండగా కాన్వాయ్‌ను నిలిపి వారి వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు దంపతులు...ముంజలు తీసి ఇవ్వండి రుచి చూస్తాం అని అడిగారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయాన తమ వద్దకు వచ్చి తాటి ముంజలు ఇవ్వమని అడగడంతో వారు ఉబ్బి తబ్బిబ్బ య్యారు. ఆకార్మికులు అందించిన తాజా తాటిముంజలను సీఎం దంపతులు రుచి చూశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులతో ముఖ్యమంత్రి కాసేపు ఆత్మీయంగా సంభాషించారు. వారి పనితీరు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకుని వారితో ఫోటో దిగారు.

## జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు ముమ్మరం



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతను పెంపొందించే దిశగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లం ఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లంఘనదారులపై ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీటుబెల్ట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడ్, అధికలోడ్ తో వెళ్లే వాహనాలకు, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై కేసులు నమోదు చేసి ఫైన్లు విధించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పోలీసులు మాట్లాడుతూ..."ప్రజల ప్రాణ భద్రతే మా ముఖ్య లక్ష్యం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, సురక్షితంగా ప్రయాణించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాగే చర్యలు కొనసాగిస్తాం" అని సూచించారు.

## పాము కాటుకు గురైన ఉపాధి మహిళ కూలి



**చెన్నూరు – సూర్య వాస్తవం :** మండలంలోని రామనపల్లె గుర్రంపాడు( కేసీ కెనాల్) కాలువ ఉపాధి పనులలో భాగంగా బుధవారం పూడికతీత పనులు చేస్తుండగా రామనపల్లె గ్రామానికి చెందిన మహిళా ఉపాధి కూలీ పాము కాటుకు గురైంది. పాము కాటుకు గురైన దస్తగిరమ్మను తోటి ఉపాధి కూలీలు హుటా హుటిన చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిం చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఈ విషయాన్ని తెలుసుకు ఉపాధి హామీ ఏపీవో శైలజ సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని దస్తగిరమ్మ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కొరకు కడప రిమ్స్ కు తరలించారు. ప్రస్తుతం దస్తగిరి అమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎలాంటి ప్రాణాపాయం లేదని ఏపీవో తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓటు బ్యాంకుగా కాకుండా నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి...!

- వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని కల్పించాలి
- సరికొత్త రాజకీయ, సామాజిక చైతన్యాన్ని తీసుకురావడానికి కలిసికట్టుగాపోరాడుదాం
- జూన్ 3 వ తేదీన బహుజన ఆత్మ గౌరవ సభను విజయవంతం చేద్దాం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ





**అనంతపురం – సూర్య వాస్తవం :** బడుగు, బలహీన వర్గాలు, దళితులు, ముస్లిం మైనారిటీలు, వెనుకబడిన వర్గాల ప్రజలు కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా, నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ.సరికొత్త రాజకీయ, సామాజిక చైతన్యాన్ని తీసుకురావడానికి పోరాడాలని తెలిపారు. జూన్ 3 వ తేదీ లలిత కళ పరిషత్ లో బహుజన ఆత్మ గౌరవ సభను విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాల ఐక్యతను చాటిచెప్పడానికి, రాజకీయంగా చైతన్య పరచడానికి ఈ సభలు వేదికవుతాయని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను విద్య, ఉద్యోగాలలో సరైన వాటా, , రాజకీయ ప్రాతినిధ్యాన్ని కల్పించాలని తెలిపారు.ఎస్సీ, ఎస్టీ, బీసీలు జనాభాలో అత్యధిక మెజారిటీని కలిగి ఉన్నప్పటికీ, చట్టసభల్లో మరియు రాజకీయ నాయకత్వంలో ఆశించిన స్థాయిలో ఎదగడం లేదు. వారికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం, అధికారం దక్కాలంటే కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## ముగ్గురు దొంగలు అరెస్ట్..

### - రెండు మోటర్ పంప్ సెట్లు, బైక్ స్వాధీనం ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి

**రాయదుర్గం– సూర్య వాస్తవం:**




డి.హిరేహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన విద్యుత్ మోటార్ల దొంగతనం కేసుకు సంబంధించి అరెస్ట్ వివరాలు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణకి రాబడిన పక్కా సమాచారం మేరకు....
డి.హిరేహల్ మండలంలో పొలాల వద్ద మోటార్లను దొంగిలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఈరోజు అరెస్ట్ చేయడమైంది. వారి వద్ద నుండి చోరీకి గురైన రెండు మోటార్ పంపుసెట్లు మరియు దొంగతనానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకోవడమైంది.

**కేసు వివరాలు:** గత నెల ఏప్రిల్ 1వ తేదీన నాగలాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో రైతులు లేని సమయం చూసి, ఇద్దరి రైతుల పొలాల్లోని మోటార్ పంపుసెట్లను నిందితులు దొంగిలించారు. దొంగిలించిన వస్తువులను మల్లికేతి చెరువు సమీపంలోని పొదల్లో దాచి పెట్టారు. ఈ రోజు (మే 20) మధ్యాహ్నం ఆ మోటార్లను బళ్ళారిలో విక్రయించేందుకు మల్లికేతి క్రాస్ వద్ద వేచి చూస్తుండగా, పక్కా సమాచారంతో పట్టుకోవడమైంది.

**ముద్దాయిల వివరాలు**

అరెస్టయిన వారు ముగ్గురూ మల్లికేతి గ్రామానికి చెందిన వారు.

1. లికావలి వీరేష్ (24)లి, తండ్రి: రుద్రప్ప
2. లివీ. జనార్ధనబాబు (22)లి, తండ్రి: జంబునాథ
3. లిబోయ హరికృష్ణ (28)లి, తండ్రి: కర్రెప్ప

**స్వాధీనం చేసుకున్న సొత్తు:** రెండు మోటార్ పంపుసెట్లు, దొంగతనానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకోని, ముద్దాయిలను ఈరోజు మధ్యాహ్నం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు గంగన్న, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రామాంజినేయులు , నాగరాజు, రమేష్, మల్లికార్జునలు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- చెంబేడు పీహెచ్‌సీని తనిఖీ చేసిన డా. బాలకృష్ణ నాయక్
- సమయపాలన, పరిశుభ్రత, రోగులకు నాణ్యమైన వైద్య సేవలపై అధికారుల ఆరా
- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**పెళ్లకూరు – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) డా.వి. బాలకృష్ణ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, పీహెచ్‌సీలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగం, ప్రసూతి గది, ఔషధ నిల్వ గదులు, ల్యాబ్ సేవలు, రికార్డుల నిర్వహణ, రోగుల హాజరు నమోదు తదితర అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించి, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్లైన్ ఎస్ఆర్ఎస్ హాజరు విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించిన డీఎంహెచ్‌వో, సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో సంబంధం ఉన్న శాఖలో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించి రోగులకు మర్యాద పూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. రోగులకు మందుల పంపిణీ విధానం, అత్యవసర వైద్య సేవలు, తల్లి-శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాల అమలు పరిస్థితులపై కూడా ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే ప్రధాన ఆధారమని, అందువల్ల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో రికార్డుల నిర్వహణ పద్ధతిని పరిశీలించిన ఆయన, అన్ని వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సేవలందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ ఆసుపత్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న డా. బాలకృష్ణ నాయక్, రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఆకస్మిక తనిఖీల ద్వారా వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.



## రైతు పండుగ కార్యక్రమంలో రైతు సోదరులు పాల్గొనాలి

**- మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి**

**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల మండలంలోని రైతు సోదరులకు తెలియజేయడం ఏమనగా ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కడపలోని మేడా కన్వెన్షన్ సెంటర్లో మూడు రోజులపాటు వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ అధ్యక్షతన రైతు పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమమునకు మండలంలోని రైతు సోదరులు రిజిస్ట్రేషన్ చేసుకుని రైతు పండుగ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు . ఈ రైతు పండుగ కార్యక్రమంలో ముఖ్యంగా అగ్రి ఇన్నోవేషన్ మరియు హార్టికల్చర్ ఎక్స్పో 2026 కు సంబంధించి ఆధునిక సాంకేతిక పద్ధతులు అలాగే స్టాల్స్ ప్రదర్శన, డ్రోన్ టెక్నాలజీ, హార్టికల్చర్, విలువ ఆధారిత పద్ధతులు, ప్రకృతి వ్యవసాయము, వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద అత్యాధునిక వ్యవసాయ పరికరాల ప్రదర్శన, అగ్రి ఇన్నోవేషన్ హ్యాకథన్, అగ్రిటెక్, స్మార్ట్ రైతు సేవలు మొదలగు అన్ని విషయాల గురించి రైతు పండుగ కార్యక్రమంలో తెలుసు కొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిసాధించే దిశగా రైతులను తీర్చి దిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కావున రైతు సోదరులు అందరూ రైతు పండుగ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు

## ఉపాధి పనుల వద్ద కనిపించని వసతులు

**- మంచినీరు, ప్రాథమిక చికిత్స కిట్‌లు నిల్**



**వేముల - సూర్య వాస్తవం:** వేముల మండల పరిధిలోని ఉపాధి కూలీలను ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. పని ప్రదేశంలో సరైన వసతులు లేని కారణంగా వారికి రక్షణ కరువైంది. దీంతో పలువురు వడదెబ్బకు గురవు తున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ఉపాధి హామీ పథకం పనులలో అక్రమాల కట్టడికి ప్రభుత్వం కూలీలు పనులకు వెళ్లే సమయంలో ఒకసారి వ్యక్తిగతంగా ఫొటో, పనులు చేసిన నాలుగు గంటల తర్వాత గ్రుపు ఫొటో తీయాల్సి వస్తుంది. దీంతో కూలీలు ఫొటోలు తీసే వరకు పనుల వద్దే ఉంటూ తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. మండు తున్న ఎండలతో కూలి పనులు అంటేనే భయపడు తున్నారు. కుటుంబాలు గడవని నిరుపేదలు ఎండ ల్లోనే పనులు చేస్తూ పోరాటం సాగిస్తున్నారు.మధ్యాహ్నం సమయం కావడంతో.. ఉదయం 7 గంటలకు పనులకు వెళుతున్న కూలీలు 11గంటల వరకు అక్కడే ఉండి పనులు చేసి ఫొటోలు తీయించుకొని ఇళ్లకు చేరే సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటుతోంది. దీంతో వడగాలిలో వారు నడిచి వస్తూ వడదెబ్బకు గురవుతున్నారు. ఎండలతో కూలీల హాజరు కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది.వేముల మండలంలో రోజుకు 3000 మందే పనులకు వస్తున్నారు. ఎండా కాలం ఉపాధి పనులు అంటేనే భయపడుతున్నారు. పైగా ఉపాధి పనుల వద్ద కనీస వసతులు ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశాలలో మంచినీరు, నీడకు టెంట్‌లు, ఎవరైన అనారోగ్యంకు గురైతే ఫస్టు ఎయిడ్ కిట్‌లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అలానే పనులకు వచ్చిన కూలీలకు ఒకసారే ఫొటో తీయాలని నాలుగు గంటల సమయం వరకు ఉన్నఫొటోను రద్దుచేయాలంటున్నారు. వేసవి ఎండలు ముగిసే వరకు అధికారులు పనుల వద్ద నిబంధనలను సడలింపు చేయాలని వారు కోరుతున్నారు.

## పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దేవాదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో బుధవారం శాశ్వత హుండీల గుర్తింపు, లెక్కింపు మొదలైంది. ఆలయంలోని మొత్తం 8 హుండీలను అధికారులు తెరిచారు. భక్తులు స్వామివారికి సమర్పించిన నగదు, ఇతర కానుకల లెక్కింపు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

# కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచితే ఆంధ్రుల నోట్లో మట్టే

**- తెలంగాణ ప్రభుత్వం అక్రమ సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్ ఎడారే**

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** కృష్ణానదిపై కర్ణాటక రాష్ట్రం 519.60 మీటర్ల ఎత్తులో ఆల్మట్టి డ్యాం ను నిర్మించుకొని 129.72 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. కానీ కర్ణాటక ప్రభుత్వం 524.256 మీటర్ల ఎత్తుకు పెంచి 279.72 టీఎంసీల నీటిని అంటే అదనంగా 150 టిఎంసిల నీటిని నిల్వ చేసుకునే విధంగా రు 87,818 కోట్లతో భూసేకరణ, పునరావాస కల్పనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎగువ రాష్ట్ర మైన కర్ణాటక ఆల్మట్టి ఎత్తి పెంచితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్లో ప్రజల నోళ్లల్లో మట్టి కొట్టడమే అవుతుందని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు.

కృష్ణా నదిపై తెలంగాణ అక్రమ సాగునీటి ప్రాజెక్టులు.

**వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ప్రాజెక్టులు.**

1. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 టీఎంసీలు.
2. డిండి ఎత్తిపోతల పథకం 30 టీఎంసీలు
3. భక్తరామదాసు ప్రాజెక్టు 5.50 టీఎంసీలు
4. మిషన్ భగీరథ 19.60 టిఎంసిలు
5. తుమ్మిళ్ల 5.44 టిఎంసిలు
6. నెట్టెంపాడు సామర్థ్యం పెంపు 3.40 టిఎంసిలు
7. ఎస్ఎల్‌బిసి సామర్థ్యం పెంపు 10.00 టిఎంసిలు
8. కల్వకుర్తి సామర్థ్యం పెంపు 15.00 టీఎంసీలు

**ప్రతిపాదనలో ఉన్న అక్రమ ప్రాజెక్టులు.**

1. పులిచింతల ఎడమ కాలువ నిర్మాణం.
2. సుంకేసుల ఎత్తిపోతల పథకం.
3. సాగర్ టెయిల్ పాండ్ ఎత్తిపోతల పథకం.
4. జోగులాంబ బ్యారేజ్ .
5. భీమా వరద కాలువ.

పై ప్రాజెక్టుల్లో ఏ ప్రాజెక్టుకు కూడా బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేవు. కేంద్రజల సంఘం, కృష్ణా నది యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవు. పై ప్రాజెక్టులు పూర్తయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ కు చుక్క నీరు రాదు. తెలుగు గంగ, గండికోట రిజర్వాయర్‌తో సహా గాలేరు నగరి, ఎస్సార్ బీసీ, హంద్రీనీవా, వెలి గొండ, నాగార్జున సాగర్, కృష్ణా డెల్టా ప్రాజెక్టుల కింద కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాలలో 50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందదు. త్రాగునీటికి కటకట. పరిశ్రమలకు నీరు ఉండదు . జల విద్యుత్ ప్రాజెక్టులకు నీరు ఉండదు . ఆంధ్రప్రదేశ్ థార్ ఎడారి అవుతుంది. ఇంత జరుగుతా ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోమ్ నగరం తగలబడి పోతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ కూర్చున్నట్లు ఉలుకు పలుకు లేకుండా ఉండడం శోచనీయం. ఇప్పటికై నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి చట్టపరంగా, న్యాయపరంగా తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలని, కర్ణాటక ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని అడ్డుకోవాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర

## బాల్య వివాహాలు టీనేజ్ ప్రెగ్నెన్సీ మీద అవాగాహన

**- సమాజంలో బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**- డిప్యూటీ డిఎంఆర్ ప్రసన్న లత**



**వేముల - సూర్య వాస్తవం:** బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ మీద అవాగాహన కార్యక్రమం మీద బుధవారం బెస్తవా రి పల్లి అంగన్వాడీ సెంటర్, వేల్పుల అంగన్వాడీ సెంటర్‌లలో డిప్యూటీ డిఎంఆర్. ప్రసన్న లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు మరియు టీనేజ్ గర్భధారణ బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చిన్న వయసులో గర్భధారణ వల్ల తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి ప్రమాదాలు మరియు శిశువులు తక్కువ బరువు తో లేదా నెలలు నిండక ముందేపుట్టే ప్రమాదం వుంది, మరణాలు పెరుగుతాయి. బాల్య వివాహాలు బాలికల చదువును ఆపి వారి అభివృద్ధిని అడ్డుకుంటాయి. సమాజంలో బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత. తల్లిదండ్రులు, సమాజం బాలికల విద్య, ఆరోగ్యంపై అవగాహన పెంచాలి. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహ పూర్వ కంగా మాట్లాడి సరియైన మార్గదర్శనం ఇవ్వాలి. బాల్య వివాహాలు మరియు టీనేజ్ గర్భధారణను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు చాలా అవసరం, వెంట వెంటనే గర్భం ధరించటం వలన మరియు ప్రసవాలు వలన తల్లిలో పోషకా హారం లోపం, తీవ్ర మైన రక్త హీనతకు కారణమవు తాయి,సరి యైన వివాహ వయసు లో పెళ్లి ల్లు అమ్మాయి లకు 18అబ్బాయలకు 21చేసుకోవాలని తెలియచేసారు. ఈకార్యక్రమంలో ఉషారాణి డి వై,హెచ్ ఈ ఓ, రమేష్ సూపెర్‌వైజర్, నవనీత ఏఎన్ఎమ్, వీణ సి హెచ్ ఓ, వసుధ అంగన్వాడీ కార్యకర్త, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గండి చైర్మన్‌కు మైనార్టీ నాయకుల సన్మానం



**వేంపల్లె - సూర్య వాస్తవం :** గండి క్షేత్రం ఛైర్మన్ ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన కల్లూరు వెంకట స్వామికి మైనార్టీ నాయకులు శాలువతో ఘనంగా సత్కరించారు. బుధవారం గండి క్షేత్రంలో ఉన్న గండి ఛైర్మన్ కల్లూరు వెంకట స్వామిని టిడిపి మైనార్టీ నేతలు పీరా సాహెబ్, ఫయాజ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పుణ్య క్షేత్రమైన గండి ఆలయానికి ఇడుపులపాయికు చెందిన టిడిపి నేత కల్లూరు వెంకట స్వామి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చేందుకు సామాన్య కార్యకర్తనైనా వెంకట స్వామికి ఛైర్మన్ పదవి ఇవ్వడమే నిదర్శనం మైనార్టీ నాయకులు పీరా సాహెబ్, ఫయాజ్ లు అన్నారు. పులివెందుల టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి సహకారంతో ఛైర్మన్ పదవి రావడం అభినందనీయం అన్నారు. మతసామరస్యానికి అందరూ కలిసి పాటు పడాలని ఛైర్మన్ వెంకట స్వామి తెలిపారు.

## జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానుల రక్తదానం అభినందనీయం

**- డాక్టర్ సుకన్య**




**పులివెందుల - సూర్య వాస్తవం:** జూనియర్ ఎన్ టీ ఆర్ అభిమానుల రక్తదానం అభినందనీయం అని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లోని ప్రముఖ సర్జన్ డాక్టర్ సుకన్య పేర్కొన్నారు.సినీ నటుడు జూనియర్ ఎన్ టీ ఆర్ 43 వ జన్మదినం సందర్భంగా పులివెందుల పట్టణ అభిమానుల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలోని రక్తనిధి యందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆసుపత్రి ప్రముఖ సర్జన్ డాక్టర్ సుకన్య, పట్టణ అభిమానుల అసోసియేషన్ అధ్యక్షులు పీవీ,రమణ, ఉపాధ్యక్షులు నబీరసూల్,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభిమానాన్ని ఎన్నో రకాలుగా తెలుపతారని, కానీ మరొకరికి ప్రాణదానాన్ని ఇచ్చే రక్తదానం అన్ని దానాలకన్నా ఎంతో గొప్ప కార్యక్రమం అని, ఇందులో జూనియర్ ఎన్ టి ఆర్ అభిమానులు వినూత్న సేవా కార్యక్రమం, 50 మంది పులివెందుల ప్రాంత యువ అభిమానులు రక్తదానం తో తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్ టి ఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం ఎంతో శుభ పరిణామం అని రక్తదానం చేసిన అభిమానులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆర్గనైజర్ శివ, రామాంజి, జహీర్ షాకీర్, ప్రసాద్, రహీం, బాషా,ఓమ్ కిరణ్, ఓబులేసు, లోకేష్,పీజీఆర్ తదితరులు పాల్గొన్నారు.

## పామిడిలో మందుల దుకాణాలు మూసివేత

**- ఆన్లైన్ వ్యాపారంపై ఎమ్మార్వోకు, సీఐకు వినతి పత్రం అందించిన మందుల షాపుల యజమానులు**

**పామిడి - సూర్య వాస్తవం:** స్థానిక పామిడి పట్టణం లోని దుకాణాలను బుధవారం ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్స్ మరియు డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపుమేరకు మూసివేసారు.బుధవారం తహసిల్దార్ షర్మిల, సీఐ శంకర్ నాయక్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పామిడి అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వి ఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఈవేళ అల్ ఇండియా సమ్మెలో పాల్గొన్నారని, ఆన్లైన్ మందుల అమ్మకాలను నిలిపి వేయాలని, ఆన్లైన్ మందుల అమ్మకాలను కార్పొరేట్ సంస్థలు అధిక డిస్కౌంట్లను ఆపాలని, నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలని కోరుతూ తహసీల్దార్ షర్మిల, సి ఐ శివశంకర్ నాయక్‌కు మందుల షాప్‌ల యజమానులు వినతి పత్రం అందించారు.ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఔషాదా తనఖీ అధికారి సూచన మేరకు ఒక మందుల షాపును తెరిచివుంచామని ఆయన తెలిపారు.



# మెడికల్ షాపులు మూతవేత



**వేంపల్లె – సూర్య వాస్తవం :** అఖిల భారత కెమిస్టుల సమాఖ్య ఆధ్వర్యంలో వేంపల్లె పట్టణంలో ఆల్ ఇండియా మెడికల్ స్టోర్ బంద్ సందర్భంగా వేంపల్లె పట్టణంలోని మెడికల్ షాపులు మూతవేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఆన్‌లైన్ మెడిషన్ విక్రయాలను నిరసిస్తూ వేంపల్లిలో మెడికల్ షాపులు మూసివేశారు. మెడికల్ షాపు యజమానులు నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేంపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్ కృష్ణ వినతిపత్రం అందజేశారు.వేంపల్లె కెమిస్ట్ ౘ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ రాయవరం సుబ్బు,ఈసీ సభ్యులు సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ ఆన్లైన్లో మెడిసిన్ అమ్మకాలతో యువత డ్రగ్స్‌కి బానిసలు అవుతారన్నారు.

అక్రమ డిస్కౌంట్లతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెటుతున్నారని తెలిపారు. నకిలీ మందులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారన్నారు.నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వాటిని



అరికట్టడానికి భారత కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, కడప జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శాంతియుతంగా బంద్ నిర్వహించినట్లు తెలిపారు.ప్రజలకు అత్యవసర మెడిసిన్ ఇవ్వడానికి అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ చంద్రమోహన్, ఈసీ సభ్యులు రాజారామ్, సాయి, రామలింగా రెడ్డి, రామాంజనేయులు, సతీష్, రామకృష్ణ, షాహిద్, దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ సయ్యద్ ఉమ్మర్ ఫరూక్‌ను వెంటనే అరెస్టు చేయాలి



**పామిడి – సూర్య వాస్తవం:** స్థానిక పామిడి పట్టణంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న షేక్షావలి,బెంకీ మహబూబ్ బాషా, మహమ్మద్ షఫీ (ఆర్మీ) సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు కే రహీం ఆధ్వర్యంలో హెచ్డి ఎఫ్సి బ్యాంకు మేనేజర్ సయ్యద్ ఉమర్ ఫరూక్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేకూర్చాలని సిఐ శివ శంకర్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్డిఎఫ్సి బ్యాంకులో గతంలో ఖాతాదారులుగా చేరామని, ఈ మధ్యకాలంలో పామిడి పట్టణంలో హెచ్డి ఎఫ్సి శాఖను ఏర్పాటు చేయడంతో బ్యాంకు మేనేజర్ సయ్యద్ ఉమర్ ఫరూక్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని, ఆయన డిపాజిట్లు చేయమని ఆకర్షణీయమైన పలుకులతో మమ్ములను ముద్దులను చేసి షేక్షావలితో 3,00,000,లు,బెంకీ మహబూబ్ బాషాతో 2,00,000, మహమ్మద్ షఫీ (ఆర్మీ)తో 1,89,350 రూపాయలను 2025 జూలై 1వ తేదీన డిపాజిట్లు చేయమని మేనేజర్ చేతికి ఇచ్చామని, ఇంతలో ఆయన కనిపించకపోవడంతో ప్రస్తుత మేనేజర్ ను కలవగా సెలవులపై అతని సొంత జిల్లా కర్నూలుకు వెళ్లిపోయాడని తెలిపారు. ఆయనకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా (రిసీవ్)ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి కర్నూలుకు పోయి విచారిస్తే అక్కడ కూడ ఇలాగే హెచ్డిఎఫ్సి బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్ పేర్లతో కొందరికి మోసం చేసి కొన్ని లక్షల రూపాయలను తీసు కొని కనిపించడం లేదని వారు కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కావున స్థానిక పట్టణ సీఐ శివశంకర్ నాయక్ కు అతనిపై దర్యాప్తు చేసి విచారించి చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేకూర్చాలని ఫిర్యాదు ఇచ్చినట్లు వారు తెలిపారు. అలాగే ప్రస్తుత మేనేజర్ కు కూడా అర్జీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కే.రహీం, షేక్షా, బెంకీ మహబూబ్ బాషా, మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి



**తాడిపత్రి – సూర్య వాస్తవం:** నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఆనంద దాయకమైన విషయం. వైద్య ఖర్చులతో ఆర్థికం గా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక పెద్ద భరోసాగా నిలిచింది. తాజా లబ్ధిదారులు 17 కుటుంబాలు రూ.31,51,599. ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అందించిన మొత్తం తాడిపత్రి నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం 562 మందికి రూ.4,44, 98,960 రూపాయలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందజేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక సహాయం అవసరమైన పేద కుటుంబాలకు ఈ నిధి నిజంగా ఒక సంజీవని లాంటిది. నియోజకవర్గంలో ఇంత పెద్ద మొత్తంలో లబ్ధిదారులకు సహాయం అందడం విశేషం.

## ప్రభుత్వ ఐటిఐ అడ్మిషన్లు ప్రారంభం

### - ప్రిన్సిపల్ వెంకటరెడ్డి



**తొండూరు – సూర్య వాస్తవం :** తొండూరు మండలంలోని ప్రభుత్వ ఐటిఐ తొండూరు నందు 2026-27 సంవత్సరమునకు గాను, మొదటి విడత అడ్మిషన్ కౌన్సిలింగ్ కై 10 వతరగతి పాసైన అభ్యర్థుల నుండి దరఖాస్తు లు (itic ap.gov.in web-siteలో) కోరడమైనది. ఆన్లైన్ నందు రిజిస్టరు చేసుకున్న అప్లికేషన్ మరియు సర్టిఫికెట్ లు ప్రభుత్వ ఐ.టి.ఐ తొండూరు నందు వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి అన్నారు.ఆన్లైన్లో అప్లికేషన్స్ రిజిస్టర్ చేసుకో వడానికి చివరి తేది: 30/6/2006. దరఖాస్తు చేసకొన్న అప్లికేషన్ 02/07/2026 తేది లోపల ప్రభుత్వ ఐ.టి.ఐ.తొండూరులో సర్టిఫికేట్‌లు వెరిఫికేషన్ చేయించుకోవాలి. ఈ ఐ.టి ఐ నందు డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజల్ ట్రేడులు కలవు.ఇతర వివరములకు ప్రభుత్వ ఐ.టి.ఐ.తొండూరులో సంప్రదించాలన్నారు.

## పోలీస్ శాఖ నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమం 'మీ మాటే మా ముఖ్యం'



**తాడిపత్రి – సూర్య వాస్తవం :** పట్టణ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో 'మీ మాటే మా ముఖ్యం' అనే ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్ లో పట్టణ ప్రజలు ఎవరైనా తమ సమస్యలను, ఫిర్యాదులను అర్జీల రూపంలో అధికారులకు నేరుగా సమర్పించి పరిష్కారం పొందవచ్చని టౌన్ సీఐ ఆరోహణరావు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరారు.

## భారీ రక్తదాన శిబిరం

### - 82 మంది రక్తదానం చేసిన ఎన్టీఆర్ అభిమానులు



**పామిడి – సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం పామిడి నందు బుధవారం జూనియర్ ఎన్టీఆర్ 43వ పుట్టినరోజు సందర్భంగా పామిడి కి చెందిన చైతన్య బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో లో పామిడి ఎద్దులపల్లి రోడ్ టీడీపీ ఆఫీస్ ఎదురుంగా జూనియర్ ఎన్టీఆర్ ఫాన్స్ అసోసియేషన్ రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది ఇక్కడ నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. 82మంది రక్త దానం చేశారు జూనియర్ ఎన్ టీ ఆర్ అభిమానుల రక్తదానం అభినందనీయం అని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభిమానాన్ని ఎన్నో రకాలుగా తెలుపతారని, కానీ మరొకరికి ప్రాణదానాన్ని ఇచ్చే రక్తదానం అన్ని దానాలకన్నా ఎంతో గొప్ప కార్యక్రమం అని, ఇందులో జూనియర్ ఎన్టిఆర్ అభిమానులు రక్తదానంతో తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్ టి ఆర్ కి జన్మదిన శు భాకాంక్షలు తెలుపడం ఎంతో శుభ పరిణామం అని రక్తదానం చేసిన అభిమానులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

## డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈగాల హరిసేవ నాయక్ బాధ్యతలు

### - విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బాదంపాలు పంపిణీ



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల విద్యుత్ శాఖ డివిజన్ ఇన్చార్జి ఈఈ గా హరి సేవ నాయక్ బుధవారం పట్టణంలోని స్థానిక డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని తప్పకుండా ప్రతి ఒక్క వినియోగదారికి న్యాయం చేసే విధంగా అడుగులు వేస్తానని అనంతరం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాదంపాలు పంపిణీ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క విద్యుత్ అధికారులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఈ గురు మోహన్ రెడ్డి, ఏడి నాగేంద్ర, కడప రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి అశోక్ బాబు, డివిజన్ ప్రెసిడెంట్, పుల్లయ్య, , లైన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి, లైన్మెన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలకు రూ 9.61 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

**ఉరవకొండ – సూర్య వాస్తవం :** నియోజకవర్గంలోని 40 గ్రామ సచివాలయ భవనాల పెండింగ్ నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ. 9.61 కోట్ల నిధులను మంజూరు చేస్తూ జీవో నంబర్ 430 విడుదల చేసింది.గ్రామ సచివాలయాల నిర్మాణాల కోసం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు కేటాయించిన నిధుల వివరాలు ఉరవకొండ రూ. 2.43 కోట్లు, విడపనకల్లు రూ. 3.10 కోట్లు, వజ్రకరూరు రూ. 1.70 కోట్లు, బెలుగుప్ప రూ. 1.49 కోట్లు, కూడేరు రూ. 89 లక్షలు. మొత్తం నిధులు రూ. 9.61 కోట్లుఈ నిధుల విడుదల ద్వారా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సచివాలయ భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తి కానున్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవడమే కాకుండా, సొంత భవనాలలో సచివాలయాల నిర్వహణ సులభతరం కానుంది.




## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



**పెద్దపప్పూరు – సూర్య వాస్తవం:** ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చింతలపల్లి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వాటిని సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.

## ప్రజా సమస్యలపై ప్రజలతో మమేకమైన ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందులలోని జగన్ క్యాంప్ కార్యాలయం నందు జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజలతో మమేకమై ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఎంపీ అవినాష్ రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేశారు. అదేవిధంగా తనను కలిసినటువంటి పార్టీ శ్రేణులతో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు

## - ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మణికంఠుడు



**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోతి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాస్తమ ఆలయ వ్యవస్థాపకులు గురు స్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనా మార్చన, బిల్వ అర్చన,అష్టోత్ర శతనామావళి, తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు. ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు కూడా నిర్వహించడం జరుగు తుందన్నారు. సాయంకాల సమయాన భజన కార్యక్రమాలు భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# హుసేనాపురం జడ్పీ హైస్కూల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ ప్రోగ్రాం





**ప్యాపిలి– సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా ప్యాపిలి మండల హుస్సేనాపురం జడ్పీ స్కూల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ ప్రోగ్రాం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గవర్నమెంట్ పాఠశాల యందు విద్యార్థుల నమోదు ప్రక్రియలో భాగంగా హుసేనాపురం పిఎం ఎస్ఆర్ఐ జడ్పీహెచ్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు అన్వర్ భాషా ఆధ్వర్యంలో ఉపా ధ్యాయ బృందం అలాగే ఎలిమెంటరీ స్కూల్ హెడ్ మాస్టర్ సర్వోత్తమ్ సర్ ఉపాధ్యాయ బృందాము పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఉప చైర్మన్, గ్రామ పెద్దలతో కలిసి ఊరంతా తిరుగుతూ పాఠశాలలో ఉన్నటువంటి సదుపాయాలు,గత అకాడమిక్ ఇయర్లో పాఠశాల పదవ తరగతిలో సాధించిన విజయాలను ప్రచారం చేస్తూ పాఠశాలలో విద్యార్థులను నమోదు చేయ వలనని ప్రచారం చేశారు. రవికుమార్, గంగాధర్ రెడ్డి రామకృష్ణారెడ్డి, గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# 'బడి పిలుస్తోంది'పై అవగాహన

**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, అనంత పురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలను చదువుకొనుటకు ప్రభుత్వ పాఠశాలలలో చే ర్పించుటకు సంకల్పించిన బడిపి లుస్తోంది.కార్యక్రమంలో భాగంగా గుత్తి మున్సిపాలిటీలో ప్రతి వార్డు, సచివాలయ పరిధి లో అవగాహన కార్యక్రమాలు చేపట్టిన మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా, ఎం.ఈ.ఓ రవి నా యక్ ఈ సందర్భంగా ఈ రోజు జం గాల కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించి కార్యక్రమం ముఖ్య ఉద్దే శ్యంగా బడి ఈడు పిల్లలను ఖచ్చి తంగా పాఠశాలకు పంపాలని తల్లి దండ్రులుకు సూచించారు.అంతే కా కుండా ప్రభుత్వం ఆందోస్తున్న ఉచి త విద్యను నిర్లక్ష్యం చేసి ప్రయివే టు పాఠశాలకు పంపి ఆర్థికపరమైన ఇబ్బందులు పడకుండా ప్రయివేటు పాఠశాలల యందు చదువు చున్న పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాల కు పంపి మంచి విద్యను అందిస్తు న్న ప్రభుత్వ టీచర్ల ద్వారా పిల్లల భ విష్యత్తుకు మంచి మార్గము వేయుటకు తల్లిదండ్రులు సహకారం చా లా ఉందని జంగాల కాలనీ యందు పర్యటించి అవగాహన చర్యలు చేప ట్టి నేటి బాలలే రేపటి భావి భారత అత్యున్నత పౌరులు అవ్వాలంటే బాల్యదశలో ప్రభుత్వం అందించే విద్యను అభ్యసించాలని విన్నవించా రు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది పాల్గొ న్నారు.



# పురపాలక స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయలేదు

## - ఓర్వలేని వ్యక్తులు చేస్తున్న ఆరోపణలు మాత్రమే
## - కమిటీ సభ్యులు



**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో ఉన్న విజయ హోమ్స్ లో పురపాలక స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు ప్రా గావేశారని కొంతమంది ఓరవలేని వ్యక్తులు ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని విజయ హోమ్స్ ప్రెసిడెంట్ వీరారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వైయస్ వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీ మురళి, వైస్ ప్రెసిడెంట్ కే రామచంద్రారెడ్డి, ట్రెజరర్ రామాంజనేయులు రెడ్డి, జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ,సోమేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు విజయ హోమ్స్‌లో విలేకరులతో బుధవారం మాట్లాడుతూ విజయ హోమ్స్ లోపురపాలక శాఖ సంబంధించిన ఆస్తిని ఎవరు కబ్జా చేయలేదని వారన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కే వేలమారి పల్లె గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 48 ఏ లో విజయ హోమ్స్ ఓనర్లు మున్సిపాలిటీ కి గతంలో ఒక ఎకరా 62 సెంట్లు స్థలం ఇవ్వడం జరిగిందని, అందులో మున్సిపాలిటీ వారు జిమ్ము పరికరాలు, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విజయ హోమ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ కేవలం వాకింగ్ చేసే వారికి ఇబ్బంది కలగకుండా బాత్రూంలు సొంత నిధులతో కట్టించడం జరిగిందన్నారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించుకునేందుకు ఒక సెంటు స్థలంలో ఒకరేకుల షెడ్డు 3 లక్షల రూపాయలు వేయంతో నిర్మించడం జరిగిందన్నారు. ఈ పార్కులో వాకింగ్ చేసే టైంలో వర్షాలు పడినప్పుడు గానీ లేదా కాసేపు చేత తీర్చుకునేందుకు ఈ షెడ్డు 3 లక్షల రూపాయల సొంత నిధులతో నిర్మించడం జరిగిందన్నారు. ఇది కేవలం మున్సిపాలిటీకి సంబంధించిన స్థలమే కానీ ఎవరు ఇక్కడ కబ్జా చేయలేదని వారన్నారు. కానీ కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని అపోహలు చూస్తూ చేస్తున్నారని వారన్నారు. అలాంటి వారిని ఎవరిని నమ్మవద్దని ప్రభుత్వానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని వారన్నారు. ఈ స్థలంలో పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన బోర్డు కూడా అలానే ఉందని అలాంటి స్థలాన్ని ఎలా ఆక్రమిస్తారని వారన్నారు. ఆ స్థలానికి ప్రభుత్వం వారు చుట్టూ కాంపౌండ్ కూడా నిర్మించడం కూడా జరిగిందన్నారు. అలాంటి స్థలాన్ని ఎలా ఆక్రమించుతారని వారన్నారు. అధికారులు వచ్చి ఒకసారి పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని వారన్నారు.


# తాతకు తగ్గ మనవడిగా జూనియర్ ఎన్టీఆర్

## - జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన నగర అధ్యక్షులు రామారావు యాదవ్



**కడప – సూర్య వాస్తవం :** నందమూరి తారక రామారావు( జూనియర్ ఎన్టీఆర్) 43వ జన్మదిన వేడుకలు సందర్భంగా కడప నగరంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పలు సేవా కార్యక్రమాలతో బుధవారం ఘనంగా వేడుకలను నిర్వ హించారు. కడప నగర ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు రామారావు యాదవ్ ఆధ్వర్యంలో చిన్న చౌక్, శ్రీనగర్ కాలనీలోని కారుణ్య వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరిపారు. అనంతరం వృద్ధులకు భోజనాలను ఏర్పాటు చేసి అభిమానులతమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రామారావు యాదవ్ మాట్లాడుతూ, దివంగత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ జూనియర్ ఎన్టీఆర్ తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. నటన, డాన్స్, డైలాగ్ డెలివరీ, యాక్షన్ సన్నివేశాల్లో ఎన్టీఆర్ చూపించే ప్రతిభ దేశవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకుంటోందన్నారు. తాతకు తగ్గ మనవడిగా ఎన్టీఆర్ పేరు ప్రతిష్టలను మరింత పెంపోదించుకు న్నారని కొనియాడారు.అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న జూనియర్ ఎన్టీఆర్ కేవలం సినీ నటుడిగానే కాకుండా సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పుట్టినరోజు సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.కారుణ్య వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అనూష మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ప్రతి సంవత్సరం వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులతో కలిసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం వారికి ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ మరెన్నో విజయాలు సాధిస్తూ అభిమానుల ప్రేమాభిమానాలతో ఇలాగే ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు నరేష్, హర్ష, వెంకట్, శివ ప్రసాద్, గోవర్ధన్, విక్రమ్, వినయ్ తదితరులు పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. అభిమానులు కేక్ కట్ చేసి నినాదాలతో సందడి చేశారు.

# వాసవి సర్కిల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందులలో పార్నపల్లి బస్టాండ్ లో వాసవి సర్కిల్ ఏర్పాటుకు సంబంధించి బుధవారం పులివెందుల ఆర్టీవో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థలపరిశీలన జరిగింది . దీనికి సంబంధించి ఆర్టీవో కూడా బస్టాండ్ సంబంధించి రూట్‌ను వాసవి సర్కిల్ గా ఏర్పాటు చేసేందుకు ఆర్డిఓ పరిశీలించారు ఆమెదించారు. దీనికి సంబంధించి,త్వరలో పార్నపల్లి బస్టాండ్ లో వాసవి సర్కిల్ ఏర్పాటు చేయబోతున్నారు అని ఆర్యవైశ్యులు అంటున్నారు. పులివెందులలో వానపల్లి బస్టాండ్‌ను వాసవి సర్కిల్‌గా త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలోఆర్యవైశ్య సంఘం అధ్యక్ష్యులు శ్రీనివాసులు ,సెక్రెటరీ సగళా మహేంద్ర ,ట్రెజరర్ రాజోలు సుబ్రమణ్యం, ఉపాధ్యక్ష్యులు మేద రమణయ్య, మేద సాయిబాబా, సభ్యులు, పబ్బతి దక్షిణామూర్తి, రమేష్, పద్మనాబయ్య, హరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వాకింగ్ సోదరుల దాతృత్వం మరువలేనిది

## - అర్బన్ సీఐ శ్రీరామ్



**పులివెందుల– సూర్య వాస్తవం :** సాటి మనిషికి సహాయం చేయడం మానవత్వానికి ప్రతీక. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం వల్ల సమాజంలో శాంతి, సామరస్యాలు పెరుగుతాయి. ఇది మనకు మానసిక తృప్తిని, ఆనందాన్ని ఇస్తుందని, పులివెందుల, అర్బన్ సీఐ శ్రీరామ్ వాకింగ్ సోదరుల దాతృత్వం మరువలేనిదని పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక నగరవనం (ఇందిరమ్మ రాణి తోపు) పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్కులో టికెట్ కౌంటర్లో పనిచేస్తున్న రాధాకృష్ణ ఇటీవల ఛాతి నొప్పి రావడంతో ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. ఆయన పేదరికం గమనించిన వాకింగ్ మిత్రులు అందరూ చేయి చేయి కలిపి రూ.1,17,000 వసూలు చేశారు. ఆయన ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షించారు. ఈ మొత్తాన్ని సీఐ శ్రీరామ్ చేతులమీదుగా వాకింగ్ మిత్రులందరి సమక్షంలో రాధాకృష్ణ కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ మన పక్క ఏమి జరుగుతున్న పట్టించుకోని ఈ సమాజంలో వాకింగ్ మిత్రులు మానవతా దృక్పథంతో రాధాకృష్ణకు సాయం అందించడం గర్వకారణం అన్నారు. మానవతా విలువలు పెంపొందించే విధముగా వాకింగ్ మిత్రులు చూపించారన్నారు. ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగరవనం, రాణి తోపు వాకింగ్ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధం

## - హెల్మెట్ వినియోగం, చెట్ల పెంపకం ఆవశ్యకత"

**పులివెందుల– సూర్య వాస్తవం :** వేద అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం సత్రం స్కూల్ నందు నిర్వహించిన "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధం, హెల్మెట్ వినియోగం, చెట్ల పెంపకం– ఆవశ్యకత" పై జరిగిన సోషల్ అవేర్‌నెస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ సి. ముని కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని మానేసి, వాటికి ప్రత్యామ్నాయాలైన జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచులు, పేపర్ బ్యాగులు వంటివి ఉపయోగించేలా తల్లిదండ్రులకు తెలియజేయాలని, విద్యార్థులు కూడా వాటిని పాటించా లని సూచించారు.అలాగే వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది ప్రాణా పాయ పరిస్థితుల నుంచి రక్షిస్తుందని, లేకపోతే కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.అదేవిధంగా అవకాశం దొరికినప్పుడల్లా చెట్లు నాటే అలవాటు విద్యార్థులు పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముచ్చటించగా, పిల్లలందరూ కమిషనర్ మాటలకు చప్పట్లతో కేరింతలు కొట్టారు. తదనంతరం నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వేద అకాడమీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



# చిరంజీవి గొప్ప మనసు..

# ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్



ఎప్‌సెట్ స్టేట్ టాపర్ రుషిని సత్కరించిన మెగాస్టార్

ఫస్ట్ ర్యాంక్ వస్తే చిరంజీవిని కల్పిస్తానని తండ్రి ప్రామిస్

1986 తర్వాత ఇంజినీరింగ్‌లో టాపర్‌గా నిలిచిన తొలి అమ్మాయి

రుషి సాధించిన ఘనతకు చిరంజీవి ప్రశంసలు

ఐఏఎస్ కలకు మద్దతు ఇస్తానని హామీ

"నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది.

**తండ్రి మాట కోసం**

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది.

**40 ఏళ్ల రికార్డు బద్దలు**

రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**మెగాస్టార్ ఘన సత్కారం**


తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు.

**ఐఏఎస్ సంకల్పానికి మద్దతు**

ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.

## జూనియర్ ఎన్టీఆర్ 'సీఎం' అంటూ..

## అభిమానుల నినాదాలు



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'డ్రాగన్'

పలు థియేటర్లలో ఈ సినిమా గ్లింప్స్ విడుదల కోసం స్పెషల్ స్క్రీనింగ్స్ ఏర్పాటు

బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద అభిమానుల కోలాహలం

టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'డ్రాగన్' ఫస్ట్ గ్లింప్స్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఐదు భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ గ్లింప్స్ కోసం హైదరాబాద్ వ్యాప్తంగా పలు థియేటర్లలో స్పెషల్ స్క్రీనింగ్స్ ఏర్పాటు చేయగా, బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద అభిమానుల కోలాహలం మిన్నంటింది. భారీ కటౌట్లు, పాలాభిషేకాలు, బాణసంచా కాల్పులతో థియేటర్ ప్రాంగణమంతా ఒక మాస్ జాతరను తలపించింది.

తమ అభిమాన హీరో స్క్రీన్ మీద కనిపించగానే ఫ్యాన్స్ చేసిన హంగామాతో థియేటర్లు దద్దరిల్లాయి. అయితే ఈ వేడుకల్లో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడంతో పాటు, అభిమానులు పెద్ద పెట్టున చేసిన "సీఎం.. సీఎం.." నినాదాలు ఇప్పుడు అటు సినిమా ఇండస్ట్రీలోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న తారక్, ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ కేవలం సినిమాలపైనే పూర్తి దృష్టి పెట్టారు. అయినప్పటికీ, ఆయన రాజకీయాల్లోకి రావాలనే డిమాండ్ అభిమానుల్లో ఎప్పటికప్పుడు వ్యక్తమవుతూనే ఉంది.

ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో ఆ స్థాయి మాస్ ఫాలోయింగ్, క్రేజ్ ఉన్న ఏకైక హీరో ఎన్టీఆర్ మాత్రమేననే చర్చ సోషల్ మీడియాలో జోరందుకుంది. దానికి తగ్గట్టుగానే ఇప్పుడు థియేటర్ల వద్ద ఫ్యాన్స్ చేసిన 'సీఎం' నినాదాలు తారక్ రాజకీయ భవిష్యత్తుపై మళ్లీ ఆసక్తికరమైన చర్చకు తెరలేపాయి.



# ఒక్క బెర్తు.. రేసులో ఐదు జట్లు

## - ప్లే-ఆఫ్స్ కు ఆర్సీబీ, సన్ రైజర్స్, గుజరాత్

## - ముంబయి, లక్నో ఎలిమినేట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-19 లీగ్ దశ మ్యాచ్‌లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సీజన్ ఆరంభంలో అదరగొట్టిన పంజాబ్, రాజస్తాన్ జట్లు ఆ తర్వాత వరుస పరాజయాలతో ప్లే-ఆఫ్స్ బెర్త్ ను ఖాయం చేసుకోలేకపోయాయి. ఇక కోల్ కతా, ఢిల్లీ, చెన్నై చివరి మ్యాచుల్లో గెలిచి ప్లే-ఆఫ్స్ బెర్తును కొట్టేయాలని ఎదురు చూస్తున్నాయి. ఎం. చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన లీగ్ మ్యాచ్ లో గెలిచిన సన్ రైజర్స్ ప్లే-ఆఫ్స్ కు చేరగా.. ఈ గెలుపుతో గుజరాత్ కూడా నేరుగా నాకౌట్ బెర్త్ కొట్టేసింది. సీజన్ ఆరంభంలో అదరగొట్టిన లక్నో సూపర్ జెయింట్స్, ఐదుసార్లు ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ చివరి 4 మ్యాచులు మిగిలి ఉండగానే ఎలిమినేట్ అయ్యాయి.




**ప్లే-ఆఫ్స్ బెర్త్ పై ఉత్కంఠ...**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) 13 మ్యాచుల్లో 9 విజయాలతో 18 పాయింట్లతో, సన్ రైజర్స్, గుజరాత్ జట్లు 13 మ్యాచుల్లో 8 విజయాలతో 2, 3 స్థానాల్లో నిలిచి ప్లే-ఆఫ్స్ కు చేరాయి. ఇక రాజస్తాన్ 13 మ్యాచులు ముగిసేసరికి 14పాయింట్లతో 4వ స్థానంలో ఉన్నా ప్లే-ఆఫ్స్ కు చేరలేదు. పంజాబ్ 13 పాయింట్లతో 5వ స్థానంలో ఉండగా.. చెన్నై, ఢిల్లీ 12 పాయింట్ల తో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఇక కోల్ కతా 12మ్యాచ్ లు ముగిసేసరికి (11పాయింట్లు) 8వ స్థానంలో ఉన్నాయి.

**రాజస్తాన్, కోల్ కతా కు కీలకం...**

రాజస్తాన్, కోల్ కతా జట్లు చివరి మ్యాచుల్లో విజయాలతో సమీకరణలు మారతాయి. రాజస్తాన్(о0.0813) 4వ స్థానంలో ఉండగా.. కోల్ కతా(-0.038) 12మ్యాచ్ లు ముగిసేసరికి 11 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది. రాజస్తాన్ జట్టు 19న లక్నోపై భారీ లక్ష్యాన్ని ఛేదించి 23న పంజాబ్ తో మ్యాచ్ కోసం ఎదురు చూస్తోంది. ఈ మ్యాచ్ లో రాజస్తాన్ గెలిస్తే 16పాయింట్లతో 4వ స్థానానికి చేరి ప్లే-ఆఫ్స్ బెర్త్ కొడుతుంది.

ఒకవేళ పంజాబ్ గెలిస్తే 15పాయింట్ల తో ప్లే-ఆఫ్స్ రేసులో నిలుస్తుంది. రాజస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. మరోవైపు కోల్ కతా 20న ముంబయి, 24న ఢిల్లీపై గెలిస్తే.. పంజాబ్, కోల్ కతాలో 15పాయింట్లతో సమానంగా ఉంటాయి. దీంతో మెరుగైన రన్ రేట్ కలిగిన జట్టు నాకౌట్ చేరుతుంది. ఇప్పటికే 13 మ్యాచ్ లు ఆడేసిన ఢిల్లీ, చెడేసిన12 పాయింట్లతో ఉన్నా.. చివరి మ్యాచుల్లో గెలిస్తే సమీకరణలు, మెరుగైన రన్ రేట్ కీలకంగా మారనుంది. ఢిల్లీ జట్టు కోల్ కతాపై, చెన్నై జట్టు గుజరాత్ పై, పంజాబ్ జట్టు లక్నో పై చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఆ జట్లు చివరి మ్యాచ్ లో గెలిస్తే మెరుగైన రన్ రేట్ సాధించిన జట్టు ప్లే-ఆఫ్స్ కు చేరుతుంది.

పంజాబ్ జట్టు చివరి మ్యాచ్ లో ఇప్పటికే ఎలిమినేట్ అయిన లక్నోతో తలపడనుంది. ఆ మ్యాచ్ లో పంజాబ్ గెలిస్తే 15పాయింట్లతో టాప్-4లో నిలిచి ప్లే-ఆఫ్స్ కు చేరుతుంది. వీటితోపాటు కోల్ కతా, రాజస్తాన్ చివరి మ్యాచుల్లో ఓటమిపాలవ్వాలి.



## బంగ్లాదేశ్ క్లీన్ స్వీప్

**- రెండో టెస్ట్ లో పాకిస్తాన్ పై 78పరుగుల తేడాతో గెలుపు**

సైహేట్(బంగ్లాదేశ్): పాకిస్తాన్ తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ను ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు 2-0తో చేజిక్కించుకొని క్లీన్ స్వీప్ చేసింది. దీంతో పాకిస్తాన్ పై తొలిసారి క్లీన్ స్వీప్ సాధించిన బంగ్లా జట్టుగా రికార్డుపుటల్లోకెక్కింది. 457పరుగుల భారీ ఛేదనలో భాగంగా పాకిస్తాన్ జట్టు రెండో ఇన్నింగ్స్లో 358 పరుగులకు కుప్పకూలింది. ఓవర్ నైట్ స్కోర్ 7వికెట్ల నష్టానికి 316 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ జట్టు మరో 42 పరుగులు జతచేసి చివరి మూడు వికెట్లను కోల్పోయింది. ఓవర్ నైట్ బ్యాటర్ రిజ్వాన్(94) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా.. సాజిద్ ఖాన్(28) బ్యాటింగ్ లో రాణించాడు. ఇక షహజాద్(0) నిరాశపరచడంతో ఐదో, చివరి రోజు పాకిస్తాన్ ఇన్నింగ్స్ తొలి సెషన్ లోనే ముగిసింది. బంగ్లాదేశ్ బౌలర్లు తైజుల్ ఇస్లామ్ ఆరు వికెట్లు పడగొట్టి పాకిస్తాన్ ఇన్నింగ్సు కుప్పకూల్చగా.. నహిద్ రాణాకు రెండు, షోరిఫుల్, మెహిదీ హసన్ లకు ఒక్కో వికెట్ దక్కాయి. తొలి టెస్ట్ లో 104 పరుగుల తేడాతో నెగ్గిన బంగ్లాదేశ్ రెండో టెస్టుఓ 78పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లింటన్ దాస్ కు, సిరీస్ ముష్ఫికర్ రహీమ్ కు దక్కాయి.

## గేల్ రికార్డును సూర్యవంశీ బ్రేక్ చేస్తాడు: కుంబ్లే

న్యూఢిల్లీ: యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మాజీ క్రికెటర్, వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ రికార్డును బ్రేక్ చేస్తాడని మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ప్రశంసలు కురిపించాడు. ఐపీఎల్‌లో ఓ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉంది. అయితే ఆ రికార్డును సూర్యవంశీ అధిగమిస్తాడని కుంబ్లే తెలిపాడు. మంగళవారం లక్నోతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఆరు సిక్సర్లు కొట్టాడు. దీంతో ఇప్పటి వరకు ఈ సీజన్‌లో సూర్యవంశీ 53 సిక్సర్లు బాదాడు. అయితే గతంలో క్రిస్ గేల్ ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 59 సిక్సర్లు బాదాడు. ఇక ఆ సిక్సర్ల రికార్డును బ్రేక్ చేసే అవకాశం సూర్యవంశీకి ఉన్నట్లు కుంబ్లే పేర్కొన్నారు.

# జలధార-జలహారతితో పెళ్లకూరు మండలానికి జలకళ

- రూ.3.25 కోట్లతో 121 నీటి సంరక్షణ పనులు వేగవంతం
- చావలి, జీలపాటూరులో పనులను పరిశీలించిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు
- 3863 ఎకరాలకు సాగునీటి లబ్ధి -- రైతుల్లో కొత్త ఆశలు
- కాలువలు, చెరువుల పూడికతీతతో భూగర్భ జలాల పెరుగుదల
- ఉపాధి హామీతో గ్రామీణ కార్మికులకు వేసవిలో ఉపాధి భరోసా





**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని చావలి మరియు జీలపాటూరు గ్రామపంచాయతీల్లో చేపట్టిన జలధార--జలహారతి పనులను తిరుపతి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు, ఎంపీడీవో, అదనపు పథక సంచాలకులు, ఇరిగేషన్ ఏ ఈ మరియు డి ఈ లు పరిశీలించారు. పనుల పురోగతిని పర్యవేక్షించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. జల సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మండలవ్యాప్తంగా నీటి వనరుల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు కొనసాగుతున్నాయి. రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో 121 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు కాగా, ఇందులో 101 కాలువల పునరుద్ధరణ పనులు, 20 చెరువులు మరియు నీటి కుంటల పూడికతీత పనులు చేపడుతున్నారు. ఈ పనుల ద్వారా మండలంలోని 3863 ఎకరాల సాగుభూములకు సాగునీటి లబ్ధి కలగనుంది. అంతేకాకుండా సుమారు 2000 మంది ఉపాధి హామీ కార్మికులకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. వేసవిలో వలసలు తగ్గిస్తూ గ్రామీణ కుటుంబాలకు జీవనాధారంగా ఈ పనులు నిలుస్తున్నాయి. చావలి గ్రామంలో రూ.9.87 లక్షల వ్యయంతో చెరువు పూడికతీత పనులు కొనసాగుతుండగా, జీలపాటూరులో రూ.1.45 లక్షలతో కాలువ పూడికతీత పనులు పురోగమిస్తున్నాయి. ఈ పనులు పూర్తయితే రెండు గ్రామాల పరిధిలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడనుంది.
అధికారుల ప్రకారం, చెరువులు, కాలువల పునరుద్ధరణతో వర్షపు నీరు సమర్థవంతంగా నిల్వై భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువు పరిధిలోని 255 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలగడంతో పాటు 12 బోర్లు, 5 బావుల్లో నీటి మట్టాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వేరుశనగ, చెరుకు, వరి, మామిడి వంటి పంటలకు సమృద్ధిగా నీరు అందనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ కార్మికులు మాట్లాడుతూ, ఈ పనుల వల్ల తమ గ్రామాల్లోనే ఉపాధి లభిస్తోందని తెలిపారు. రోజుకు రూ.307 వరకు వేతనం అందుతుండటంతో కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలుగుతోందన్నారు. అదేవిధంగా పశువులు, గొర్రెలు, మేకలకు త్రాగునీటి సమస్య కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. జలధార--జలహారతి పనులు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు కొత్త దిశను చూపుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పూడికతీతతో మళ్లీ జీవం పొందుతున్న కాలువలు, నిండుకుండలా మారుతున్న చెరువులు రైతు జీవితాల్లో ఆశల కిరణాలుగా నిలుస్తున్నాయి. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తోంది.

## మెడికల్ షాపు యజమానుల నిరసన ర్యాలీ




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ఆన్‌లైన్‌లో మందులు అమ్మకాన్ని నివారించాలని కోర తూ గుత్తిలో అఖిల భారత కెమిస్టుల సమాఖ్య ఆధ్వర్యంలో మెడికల్ షాపుల నిర్వాహకులు నిరసన ర్యా లీ చేపట్టారు. ఈ ర్యాలీ పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్ నుండి గాంధీ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించా రు.అసోసియేషన్ నాయకులు నాగ సుదర్శన్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఆన్‌లైన్‌లో మందులు అమ్మడం వ ల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగు తుందని కెమిస్టులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ మందుల అమ్మకాలు,అధి క డిస్కౌంట్లు,కొత్త నిబంధనలు చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసిల్దార్ పుణ్యవతి కి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మెడికల్ షాపులు మొత్తం మూత పడడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణంలోని మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక విచారణపై ఆర్డీఓ కార్యాలయంలో కీలక సమావేశం

**- హాజరైన అఖిలపక్ష నేతలు**



**పులివెందుల - సూర్య వాస్తవం:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమంపై బుధవారం సాయంత్రం 4:00 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్వో నజీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని మండలాల తహసీల్దార్లు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అఖిలపక్ష నేతలు,ముఖ్య నాయకులు మరియు ప్రతినిధులు హాజరయ్యారు.?ఈ సందర్భంగా సమావేశంలో అధికారులు మాట్లాడుతూ,రాబోయే జూన్ 15, 2026 నుండి జూలై 14, 2026 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితా విచారణ ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు.జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని, ఈ ప్రోగ్రామ్‌ను ఎలాంటి పొరపాట్లు లేకుండా, పారదర్శకంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు, అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎమ్మార్వో నజీర్ అహ్మద్ సుదీర్ఘంగా వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా,బోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియ సక్రమంగా జరిగేలా అన్ని పార్టీ శ్రేణులు అధికారులకు పూర్తి సహకారం అందిస్తాయని పార్టీ నాయకులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ/మండల స్థాయి అన్ని పార్టీల ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, అన్ని మండలాల తహసీల్దార్లు మరియు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జీపీఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన గుమ్మనూరు ఈశ్వర్

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం గాంధీ సర్కిల్ దగ్గర ఉన్న ఫుట్బాల్ గ్రౌండ్‌లో జీపీఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిథిగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం ఎంఎల్ఏ గు మ్మనూరు జయరాం తనయు డు గుత్తి మరియు పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మ నూరు ఈశ్వర్ ముందుగా యువనేతకు జీపీఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్స్ ఘన స్వాగతం పలికారు యువనేత ఈశ్వర్ మ్యాచ్ ను తిలకించారు ఫైనల్ మ్యాచ్లో గుత్తి ఎల్లో స్టార్స్ వర్సెస రజా పురం కింగ్స్ రెండు టీములు తలబడడం జరిగింది.ఫైనల్ మ్యాచ్ లో ముందుగా బ్యా టింగ్ చేసిన ఎల్లో స్టార్స్ టీం 92/7 రెండో బ్యాటింగ్ దిగిన రాజాపురం కింగ్స్ 75/9 నష్ట పోయి ఎల్లో స్టార్ టీమ్ విన్న ర్స్ గా నిలవడం జరిగినది. ర న్నర్స్ గా రాజాపురం కింగ్స్ టీం నిలిచినది.జీపీఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ కు మొదటి బ హుమతి గుత్తి పట్టణ అధ్య క్షులు ఎం కె చౌదరి 50,000 రూపాయలు,రెండో బహుమ తి గుత్తి ప్రభుత్వాసుపత్రి అభి వృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ 25,000 రూ పాయలు అందించడం జరిగి నది అలాగే ట్రోపి స్పాన్సర్స్ గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి అభి వృద్ధి కమిటీ సభ్యులు యర్ర గుడి రమేష్,ఆర్ఎస్ యువ నాయకుడు రాజా జీపీఎల్ క్రికె ట్ ప్రీమియర్ లీగ్ కు టోర్న మెంట్ ఆర్గనైజర్స్ గా గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్క ల చెరువు ప్రతాప్,చెరుకూరి లక్ష్మణ్ చౌదరి,డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ,బండగేరి రవి అందీయడం జరిగినది యువనేత ఈశ్వర్ మాట్లా డుతూ క్రీడలు ప్రోత్సహించ డంలో మా గుమ్మనూరు ఫ్యా మిలీ ముందు ఉంటుందని అలాగే గెలుపు ఓటములు సహజమని తెలియజేశారు. ఇంకా ఇలాంటి క్రికెట్ టోర్న మెంటులో ఎన్నో పెట్టి యువ తను ప్రోత్సహిస్తామని తెలి యజేశారు గెలిచినవారు ఎ క్కువ ఓడిన వారు తక్కువ కాదని అందరూ సమానులని తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో క్రీడాకారులు మరియు గుత్తి పట్టణం మరియు మండ లం కూటమి నాయకులు కా ర్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగినది.



## డ్రోన్ కెమెరాల నిఘా నీడలో లింగాల



**లింగాల - సూర్య వాస్తవం :**
జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు బుధవారం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరాల వినియోగంతో లింగాల మండల పరిధిలో అసాంఘిక శక్తుల కదలికలపై, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యక్తులపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఈ-చలానాలు వేస్తామని అన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని లింగాల ఎస్.ఐ జగదీశ్వర రెడ్డి కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక చర్యలకు సంబందించి డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారాన్ని అందించాలని లింగాల ఎస్.ఐ జగదీశ్వర రెడ్డి ప్రజలకు సూచించారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



**పులివెందుల క్రైమ్ - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకోవడం జరిగింది .వివరాలలోకి వెళితేఒక వ్యక్తి మోటార్ బైక్‌పై వెళు ్తుండగా, గాంధీ సర్కిల్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు పాలయి ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన వ్యక్తి తొండూరు మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు . మృతుని పూర్తి వివరాలు,అతను తొండూరు మండలంలోని ఏ గ్రామానికి చెందినవాడు అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు.ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదానికి అతివేగమే కారణమా లేక మరేదైనా వాహనం ఢీకొట్టిందా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## 22న జొన్నగిరి గోల్డ్‌మైన్స్‌కు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర రాక...

**- ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ ఓబులేష్**



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** మండలంలోని జొన్నగిరి గోల్డ్ మైన్స్‌కు ఈ నెల 22న రాష్ట్ర గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ లు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పత్తికొండ ఆర్డీఓ ఓబులేష్ పరిశీ లించారు. బుధవారం జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాంతాన్ని సందర్శించిన ఆర్డీఓ ఓబులేష్, మంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, వేదిక, రహదారుల పరిస్థితి, పార్కింగ్ సౌకర్యాలు, తాగునీరు తదితర అంశాలను అధికారులతో కలిసి సమీక్షించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసిల్దార్ ఎస్ రవి, సర్వేయర్ సుధాకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరాముడు, వీఆర్వో రంగన్న,జిఎం, బాలాజీ, పిఆర్ఓ రాజేష్, రెవెన్యూ, పోలీస్, మైన్స్ శాఖ అధికారులు పాల్గొన్నారు

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు...

**- వృద్ధాశ్రమంలో అన్నదానం**





**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన సంద ర్భంగా బుధవారం పట్టణములో జూని యర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వ హించారు ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసి యేషన్ తాలూకా అధ్యక్షుడు బిటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీడీఎస్ వృద్ధాశ్రమం నందు కేక్ కట్ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిటి పవన్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ తెలుగు ఇండస్ట్రీలో నంబర్ వన్ స్థానాన్ని అధిరోహించాలని కోరుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా అగ్రస్థానంలో ఉన్న అభిమానుల పట్ల ఎంతో ఆప్యాయత అనురాగాలతో ఉంటారన్నారు త్వరలో రాబోయే తదుపరిచిత్రం డ్రాగన్ అఖండ విజయం సాధించాలని కోరారు నిరాడంబరుడు,నిగర్వి, నిబద్ధత కల వ్యక్తి అని కొనియాడారు ఆయన,ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో, మరెన్నో జరుపుకోవాలని ఆయుష్ ఆరోగ్యాలతో కలకాలం జీవించాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు , చక్రి బీవీఎస్, వినయ్ గౌడ్, బళ్లారి వినయ్, రాతన రాజు, చక్రాల కార్తీక్, మహేంద్ర, చరణ్, వినోద్, మధు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )